క్లుప్తంగా

కృత్రిమ మేధస్సుపై శిక్షణ



అతిథిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో కృత్రిమ మేధస్సుపై ఏఐ సీటీఈ అటల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌బీవీ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్ రంగాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అతిథులకు ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ రామాయణం సురేష్, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : స్థానిక ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని గిండీస్ ఐఏఎస్ అకాడమీలో రాష్ట్ర, జాతీయ పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఇండియన్ ఎకానమీ స్టడీమెటీరియల్‌ను సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విక్రమ సింహపురి వర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఆర్ శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైందని, పోటీ ప్రపంచంలో రాణించాలంటే సరైన గైడెన్స్ ఉన్న సంస్థలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వీయూ మాజీ రెక్టార్ మచ్చా భాస్కర్, ప్రొఫెసర్ దశరాజు, విశ్రాంత ప్రొఫెసర్ కృష్ణమూర్తి, చైర్మన్ డాక్టర్ సురేష్ కుమార్ గిండి, డైరెక్టర్ విజయకుమార్ గిండి పాల్గొన్నారు.

'బజాజ్ ఫ్రీడమ్ 125' ఆవిష్కరణ



స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులోని శ్రీరామ బజాజ్ షోరూమ్‌లో సరికొత్త గేమ్ చేంజర్ ద్విచక్రవాహనం బజాజ్ ఫ్రీడమ్ 125ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ఆవిష్కరించారు. షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బజాజ్ ఫ్రీడమ్ సీఎన్‌జీ మోటార్ సైకిల్‌లో 50శాతం ఇంధనం ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. కేవలం 2 కిలోల సీఎన్‌జీ ఇంధనంతో 200 కిలోమీటర్లకుపైగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. పెట్రోల్, సీఎన్‌జీ రెండింటితోనూ వినియోగించవచ్చని, అత్యాధునిక ఫీచర్స్ ఉన్నాయని వివరించారు. ఏజీ అండ్ పీ ప్రథమ్ సేల్స్, మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎస్ఎస్‌వీబీఆర్ ప్రసాద్, షోరూమ్ ప్రతినిధి ఆర్.సాకేత్ రామ్ పాల్గొన్నారు.

30న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 30వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామాగ్రిని నీటితో శుద్ధి చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణం చేపట్టనున్నారు.


నూతన వస్త్రాలు సమర్పణ

దీపావళి సందర్భంగా ఈనెల 31న రాత్రి 7 గంటలకు శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దోశ పడి, దీపాలను తీసుకువచ్చి శ్రీకోదండరామస్వామివారికి సమర్పించనున్నట్లు టీటీడీ వెల్లడించింది.

రోగులకు భోజనం పంపిణీ

చంద్రగిరి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు భోజన పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇచ్చిన మాట ప్రకారం 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు మార్చామని వెల్లడించారు. అలాగే పోస్టుమార్టం గదిని కూడా ప్రారంభించమన్నారు. ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

భీష్మయ్య నాయుడి మృతికి సంతాపం



భీష్మయ్య నాయుడు (ఫైల్)

చంద్రగిరి : టీటీడీ విశ్రాంత హెల్త్ అధికారి, నారావారిపల్లె కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ బొబ్బా భీష్మయ్య నాయుడు (69) సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

కమర్షియల్ షో

విశ్వవిద్యాలయమా..? వ్యాపార కేంద్రమా..?

ఎస్వీయూ క్రీడా మైదానం



శ్రీవేంకటేశ్వరా విశ్వవిద్యాలయం ప్రతిష్టను అధికారులు ఫణంగా పెడుతున్నారు. కొందరి మెప్పు కోసం నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. యూనివర్సిటీని వ్యాపార కేంద్రంగా మార్చేస్తున్నారు. టీడీపీ నేతల జేబులు నింపేందుకు ఎస్వీయూ స్టేడియంలో ప్రైవేట్ కార్యక్రమాలకు అనుమతులు మంజూరు చేసేస్తున్నారు. ఇదే అదునుగా అధికార పార్టీ నాయకులు సినీ నేపథ్యగాయకుడు కార్తీక్ లైవ్ షో ఏర్పాటు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా నిర్ణయించిన భారీ ధరలతో టికెట్‌లను విక్రయించేస్తున్నారు. విద్యార్థుల మనోవికాసానికి వినియోగించే మైదానంలో మోసపూరిత పోకడలకు శ్రీకారం చుడుతున్నారు. దీనిపై విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఎస్వీయూ మైదానంలో ప్రైవేట్ కార్యక్రమమా..?
- పెద్దల ప్రాపకం కోసం వర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తారా..?
- విద్యార్థుల భద్రతకు బాధ్యత ఎవరిది..?
- మండిపడుతున్న విద్యార్థి సంఘాలు
- మామూళ్ల మత్తులో అధికారులు



లైవ్ షోకు నిర్వాహకులు రూ.వేలల్లో నిర్ణయించిన ధరల పట్టిక

తిరుపతి సిటీ : ఎస్వీయూ పవిత్రతను, కీర్తిని బూడిద పాలు చేసేలా వర్సిటీ అధికారులు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారని విద్యార్థులు మండిపడుతున్నారు. తన వ్యాపార ప్రయోజనాలకోసం అధికార పార్టీకి చెందిన ఓ నేత ఈనెల 26న సింగర్ కార్తీక్ లైవ్‌షో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం సదరు నేతకు వర్సిటీ అధికారులు వంత పాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా లైవ్ షో వీక్షించేందుకు రూ.2 వేల నుంచి రూ.8వేల వరకు టికెట్ ధరలు నిర్ణయించారు. ఆన్‌లైన్ యాప్ ద్వారా టికెట్ల బుకింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. గతంలో ఓ సినిమా ప్రమోషన్ కోసం అనుమతి ఇస్తే ఓ ఉద్యోగి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఇప్పుడు మళ్లీ ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వర్సిటీ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ భద్రతకు భంగం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. వర్సిటీ ప్రతిష్ట, విద్యార్థుల భద్రతను దెబ్బతీసే కార్యక్రమాలను అడ్డుకుంటామని పలు సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

వివాదాస్పదంగానే నిర్ణయాలు

వర్సిటీ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగానే ఉంటున్నాయి. ఇప్పటికే ఉద్యోగుల అర్హతను ప్రామాణికంగా తీసుకోకుండా కనీస అవగాహన లేని విభాగాలకు బదిలీ చేశారు. ఎంతోమంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించి రోడ్డు పాలు చేశారు. ఇప్పుడు విద్యార్థుల భద్రతను పట్టించుకోకుండా వాణిజ్య కార్యక్రమానికి అనుమతులు ఇచ్చారు. ఇలాంటి నిర్ణయాలతో ప్రభుత్వానికి సైతం చెడ్డ పేరు వస్తుందని విద్యార్థి సంఘాల నేతలు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

నిరసన తప్పదు



గతంలో ఎన్నోసార్లు ఇలాంటి కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చి విద్యార్థులు, ఉద్యోగుల ఇబ్బందులకు అధికారులే కారణమయ్యారు. వర్సిటీ నిధులతో రూ.కోట్లు ఖర్చు పెట్టి క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి వాణిజ్య కార్యక్రమాల కోసం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం సమంజసం కాదు. వెంటనే ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి. లేదంటే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన తప్పదు. లైవ్ షోను అడ్డుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతాం.

– జె.మల్లికార్జున, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అనుమతులు రద్దు చేయాలి



పేద విద్యార్థుల క్రీడల కోసం అభివృద్ధి చేసిన మైదానాన్ని వాణిజ్య కార్యక్రమాలకు ఇవ్వడం సరికాదు. విద్యార్థులను ఉచితంగా లోనికి అనుమతించకుండా వేల రూపాయల టికెట్ల ధరలను నిర్ణయించడం దారుణం. ఈ విషయంపై వర్సిటీ అధికారులు పునరాలోచించుకోవాలి. తక్షణం అనుమతులను రద్దు చేయాలి. అధికారులకు మరోసారి మా విద్యార్థి సంఘం తరపున వినతిపత్రం అందిస్తాం. ఇలాంటి వ్యాపార ప్రయోజనాలకు గ్రౌండ్‌లో తావు లేదని చెబుతాం.

– ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం



లైవ్ షోను నిర్వహించి రూ.కోట్లు వెనకేసుకునేందు యత్నిస్తున్న వ్యాపారులకు వంత పాడుతున్న వర్సిటీ అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం. ఎంట్రీ ఫీజు రూ.8 వేలు వసూలు చేయడం ఎస్వీయూ చరిత్రలో లేదు. పేద విద్యార్థుల క్రీడాభివృద్ధికి వర్సిటీ గ్రౌండ్‌ను ఉపయోగించకుండా వాణిజ్య కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. లంచాలకు తలొగ్గే ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారనే అనుమానం వస్తోంది.

– కిషోర్ దాస్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

వెనక్కితీసుకోవాలి



వర్సిటీ మైదానంలో జరగనున్న లైవ్ షోకు ఆలోచనా రాహిత్యంగా అధికారులు అనుమతులివ్వడం దారుణం. గతంలో జరిగిన ప్రోగ్రామ్‌లకు ఎంతోమంది విద్యార్థులు, ఉద్యోగులు తొక్కిసలాటలో గాయాలపాలయ్యారు. ఓ ఎలక్ట్రికల్ ఉద్యోగి మరణించారు. విద్యార్థులకు సైతం ఉచిత ప్రవేశం కల్పించకుండా అన్యాయంగా టికెట్ రేట్లను నిర్ణయించారు. బిజినెస్ ప్రమోషన్ చేసుకునే నేతలకు ఇచ్చిన అనుమతులను వెంటనే వెనక్కి తీసుకోవాలి.

– నవీన్, ఏఐఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షుడు

హామీలు అమలు కోసం నిరసన రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి కల్చరల్ : కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించి కార్మికుల ఆశలను రెట్టింపు చేసిందన్నారు. నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన మేనిఫెస్టోలో హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం రూపొందిస్తామన్నారని వెల్లడించారు. ఆటో, ట్రాన్స్‌పోర్టు రంగం కార్మికులు, వీధి వ్యాపారులను అందరినీ కలిపి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ చేపట్టే నిరసనకు కార్మికులందరూ పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నేతలు ఎన్‌డీ రవి, శ్రీరాములు, వైఎస్ మణి, సురేష్, ఆటో వర్కర్స్‌యూనియన్ నేత వెంకటేష్ పాల్గొన్నారు.

24 నుంచి రీసర్వే గ్రామ సభలు



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రామచంద్రాపురం: మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి రీసర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముందుగా సెవాయికాలువ, 25న బ్రాహ్మణకాల్వలో గ్రామ సభలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు చెప్పారు. ఆ సర్వేపై ప్రజలకు ఏమైనా అభ్యంతరాలుంటే సభలో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

మహిళలకు క్యాన్సర్ వైద్య శిబిరం



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకయ్యబాబు

తిరుపతి కల్చరల్ : రాస్ మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం టాటా ట్రస్ట్ సహకారంతో సోమవారం తాతానగర్‌లో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ మితాహారం, క్రమం తప్పని వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. రాస్ సంస్థ ఆధ్వర్యంలో మూడేళ్లుగా వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రాస్ ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ నాగేశ్వర్ మాట్లాడుతూ బరువు తగ్గడం, జ్వరం వస్తుండడం, దగ్గు, నిరంతర తలనొప్పి, మూత్రనాళంలో రక్తం రావడం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా 150 మంది మహిళలకు బీపీ, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భసంచి సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. రాస్ సిబ్బంది ధనలక్ష్మి, సత్యనారాయణ, జమునారాణి, శశికళ, రేఖారాణి, నరసమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్

తిరుపతి తుడా : ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యమివ్వాలని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన 32 వినతులు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని యువ అన్వేష్ వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈలు తులసికుమార్, గోమతి, సెక్రటరీ రాధిక, బాలాజీ, రమణ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, రవి, మేనేజర్ హసీమ్, అకౌంటెంట్ రమేష్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

జేసీఐ తిరుపతి అధ్యక్షుడిగా శేషసాయి



తిరుపతి తుడా: జేసీఐ తిరుపతి అధ్యక్షుడిగా శేషసాయి గెలుపొందారు. ఖమ్మ సంఘంలో సోమవారం నిర్వహించిన జేసీఐ అఖిలపక్ష సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో రాచకొండ శేషసాయి అధ్యక్షుడిగా గెలుపొందారని ఎలక్షన్ నామినేషన్ కమిటీ చైర్మన్ గుణశేఖర్ తెలిపారు. 2025 సంవత్సరం కార్యవర్గాన్ని త్వరలో తెలియజేస్తామని శేషసాయి తెలిపారు.

అమరవీరులకు ఘన నివాళి





అమరవీరులకు గౌరవ వందనం సమర్పిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది

తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఎఎస్టీఎఫ్) కార్యాలయంలో ఎస్పీ పి. శ్రీనివాస్ సోమవారం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో చైనా చేసిన మెరుపు దాడుల్లో 16 మంది జవాన్లు మరణించారని తెలిపారు. ఆ రోజును సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. గత ఏడాది టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్ బి.గణేష్ మరణించడాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు అమరవీరులను స్మరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు డీఎస్పీ జి.బాలిరెడ్డి గత సంవత్సరం దేశ వ్యాప్తంగా మరణించిన అమర వీరుల పేర్లు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (ఆపరేషన్స్) కే.సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఎసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వోలు మురళీకృష్ణ, ఆర్ఐ కృపానంద, సిబ్బంది పాల్గొన్నారు.

మార్పుల ముచ్చట!



ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు సోమవారం మీసేవ కేంద్రాలకు పోటెత్తారు. ఆధార్ కార్డులో ఏమైనా తప్పలుంటే మార్పులు చేర్పులకు విద్యాశాఖ అవకాశం కల్పించడంతో పెద్దసంఖ్యలో ఆయా సెంటర్ల వద్ద బారులు తీరారు. సమయం తక్కువగా ఉండడంతో తల్లిదండ్రులతో కలిసి కూ కట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అబద్ధపు హామీలతోనే అధికారం



తొండమల్ల పుల్లయ్య

తిరుపతి మంగళం : అబద్ధపు హామీలను గుప్పించి, ప్రజలను మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ విభాగం అధ్యక్షుడు తొండమల్ల పుల్లయ్య మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మాయమాటలతో ప్రజలను వంచించడమే ఆయన నైజమని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని, దానికే స్వర్ణకార కార్పొరేషన్‌గా నామకరణం చేసి చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. నాయీ బ్రాహ్మణులకు ఆలయాల్లో ఉద్యోగ భద్రత కల్పించి, రూ.20వేల వేతనం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. టీటీడీ వేద పాఠశాల విద్యార్థులకు అప్పట్లో రూ.2లక్షల డిపాజిట్ చేశారని, ఇప్పుడు చంద్రబాబు వచ్చి రూ.3వేలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీల అభ్యున్నతికి జగనన్న మాత్రమే కృషి చేశారని స్పష్టం చేశారు. పలు కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, సహకారం అందించారని తెలిపారు. చంద్రబాబు మాయమాటలతో కాలం వెలిబుచ్చుతారని, ఒక్క హామీ కూడా అమలు చేయరని విమర్శించారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మురళి, బాలు



మురళి | బాలచంద్ర | చంద్రబాబు | ప్రకాష్ | లావణ్యకుమార్

తిరుపతి కల్చరల్ : తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మురళి, బాలచంద్ర భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఆదివారం ఎన్నికలు నిర్వహించగా, సోమవారం ఉదయం ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ చేపట్టారు. అధ్యక్షుడిగా ఆర్.మురళి, కార్యదర్శిగా పి.బాలచంద్ర, కోశాధికారిగా జి.చంద్రబాబు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 562 మంది ఓటర్లకు గాను 517 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడు మురళి 211 ఓట్ల మెజారిటీ సాధించారు. కార్యదర్శి బాలచంద్ర 161, కోశాధికారి చంద్రబాబు 137 ఓట్ల ఆధిక్యంతో గెలుపు బావుటా ఎగురవేశారు. ఎన్నికల అధికారి ఆర్.మురళి వీరిని విజేతలుగా ప్రకటించారు. అలాగే ఎస్.ప్రకాష్‌బాబు 211 ఓట్లు, ఆర్.లావణ్యకుమార్ 160 ఓట్లతో ఉపాధ్యక్షులుగా గెలుపొందారు. ఈ క్రమంలోనే సంయుక్త కార్యదర్శులుగా జగదీష్‌కుమార్, చెంచు బత్తెయ్య, మాధవ్ విజయం సాధించారు. కార్యవర్గ సభ్యులకు సంబంధించి ఓట్ల లెక్కింపు అర్ధరాత్రి వరకు కొనసాగుతోంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులను సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు. పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 73,926 మంది స్వామిని దర్శించుకున్నారు. 23,726 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం భక్తులు నిర్దేశించిన సమయానికి రావాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

సమస్యల పరిష్కారానికి వినతి

పాకాల : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఎంఈఓ బాబ్జీకి వినతిపత్రం సమర్పించారు.